# సింగరేణి బతకాలంటే మళ్లీ సీఎంగా కేసీఆరే ఉండాలి..

- రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరాలి
- కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్
- ఇందారం ఓపెన్‌కాస్టు, భూగర్భ గని వద్ద కార్మికులతో గేట్ మీటింగ్

జైపూర్, నవంబర్ 25: సింగరేణి బతకాలంటే కేసీఆర్ ఉండాలి, గులాబీ జెండా రాష్ట్రంలో ఎగురాలని చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గని, భూగర్భగని వద్ద శనివారం ఉదయం ఎంపీ వెంకటేశ్‌నేతకాని, మాజీ మంత్రి బోడ జనార్దన్, టీబీజీకేఎస్ నాయకులతో కలిసి గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. సింగరేణి బతకాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కారుణ్య నియామకాల ద్వారా రూ.15 వేల పైచిలుకు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని తెలిపారు. తెలంగాణ తొలి అసెంబ్లీ సమావేశాల్లో కార్మికులకు ఆదాయపు మినహాయించాలని తీర్మానించి కేంద్రానికి పంపినా కేంద్రం పెడచెవిన పెట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం నల్ల సూర్యుల ఇన్‌కం ట్యాక్స్ మాఫీకి పోరాడుతుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కొంచెం కరుణ చూపలేదని తెలిపారు. సింగరేణి క్వార్టర్ కలిగిన కార్మికుడి జీతం పైన పెర్క్ టాక్స్ ను ( గ్యాస్, వాటర్, ఎలక్ట్రిసిటీ సౌకర్యాలపై వేసేది ) కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధంగా సింగరేణిలో కూడా యాజమాన్యమే కార్మికులకు చెల్లించేలా చేస్తామని మొన్న మందమర్రిలో జరిగిన సభలో ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో పాటుగా సింగరేణి క్వార్టర్లను కార్మికులకు, రిటైర్డ్ కార్మికులకు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సింగరేణి ప్రాంతం మనుగడ కొనసాగాలంటే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. 32% లాభాలను, స్పెషల్ ఇంక్రిమెంట్లను, సుమారు 17వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సింగరేణి కంపెనీ వాటాను 49% కేంద్రానికి అప్పజెప్పే సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్నది వెంకటస్వామేనని కార్మికులు గ్రహించాలని తెలిపారు. వివేక్ చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు చేసింది ఏంలేదని పైగా సింగరేణి గనులను వేలం వేయాలంటున్న అవివేకి వివేక్‌కు కార్మికులు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా కనబడని వివేక్ ఎన్నికలు రాగానే ఓట్ల కోసం కార్మికులపై దొంగ ప్రేమ చూపిస్తున్నాడని ఓట్ల కోసం నోట్ల కట్టలు, సూటు కేసులతో దిగి లీడర్లను కొంటున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు అన్యాయం చేసిన కుటుంబం వివేక్‌దని సింగరేణి సంస్థపైన సింగరేణి కార్మికుల సమస్యలపై కనీస అవగాహన లేని వ్యక్తి వివేక్ అని దుయ్యబట్టారు. కార్మికులు సంఘాల పేరు మీద ఆగం కావొద్దు, తొందరపడొద్దు, ఆలోచించి ఓటు వేయాలని తెలిపారు. కేకే6, శ్రావణపల్లి ఓసీలను వేలానికి పెడితే ఆనాడు బీజేపీలో ఉండి కూడా ఒక్కనాడు వివేక్ పోరాటం చేయలేదన్నారు. దేశం మొత్తం ఫ్యాక్టరీలు పెట్టిన వివేక్ ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఎందుకు పెట్టలేదని ఈ ప్రాంత యువకులకు ఎందుకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. మన ప్రాంత యువకులకు ఉద్యోగం ఇవ్వని వివేక్‌కు ఎమ్మెల్యే ఉద్యోగం ఎందుకు ఇవ్వాలని కార్మికుల ఆలోచించాలన్నారు. కార్మికులందరూ సంఘాలకు అతీతంగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల తరపున గొంతునై నినదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వద్ద కార్మికుల ఏజెంటుగా సేవ చేస్తానని కార్మికులందరూ పేద బిడ్డ బాల్క సుమన్ దిక్కై ఉండాలి. పెట్టుబడిదారి వివేక్ ని ఓడగొట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీ అన్నయ్యతో పాటు కార్యకర్తలున్నారు.


ఇందారం ఓసీపై మాట్లాడుతున్న చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

### కార్మిక వాడల్లో బీఆర్ఎస్ ప్రచారం

సీసీసీ నస్పూర్, నవంబర్ 25: సింగరేణి కార్మిక వాడల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు నాగార్జునకాలనీలో ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాలు అందజేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. సింగరేణి సంస్థ ప్రైవేట్‌పరం కావద్దంటే మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంగల కుమారస్వామి, ఆకునూరి సంపత్‌కుమార్, శ్రీనివాస్, తదితరులున్నారు.

### బీఆర్ఎస్‌కు సింగరేణి కార్మికులు అండగా నిలవాలి

మందమర్రి, నవంబర్ 25: తెలంగాణ ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ బొగ్గు కార్మికులకు అనేక హక్కులు కల్పించారని కార్మికులందరు బీఆర్ఎస్ అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్ అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏ ప్రభుత్వంతో సాధ్యంకాని హక్కులను సింగరేణిలో సీఎం కేసీఆర్ సాధించారని, మరిన్ని హక్కులు బీఆర్ఎస్ సర్కారుతోనే సాధ్యమని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ గెలిపించాలని కార్మికులను కోరారు. అనంతరం సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం కల్పించిన హక్కులు, మెనీఫెస్టో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు బడికెల సంపత్, ఓ.రాజశేఖర్, రాజిరెడ్డి, భిల్లా మాధవరెడ్డి, సామంతుల స్వామి తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో పోస్టర్ విడుదల చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు


సీసీసీనస్పూర్ : కార్మిక కాలనీలో ప్రచారం చేస్తున్న నాయకులు

## కోల్ బెల్ట్ బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే మా లక్ష్యం

- ఏ పార్టీ, యూనియన్ చేయని పనులు చేశాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు


బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకట్రావు, నాయకులు

జయశంకర్ భూపాలపల్లి.నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి ప్రాంత బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) పని చేస్తున్నదని టీబీజీకేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీ వెంకట్రావు అన్నారు. శనివారం భూపాలపల్లిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సాధించిన హక్కులు, పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. భూపాలపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి కార్మికులు అధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా సింగరేణిలోని 11 డివిజన్‌లో 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీబీజీకేఎస్ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పని చేస్తున్నారని అన్నారు. జాతీయ సంఘం పోగొట్టిన వారసత్వపు హక్కును సీఎం కేసీఆర్ తిరిగి సాధించడంపై కార్మికులు చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా 12 వేలకు పైగా ఉద్యోగాలు కార్మికుల పిల్లలకు లభించాయని, 4 వేల ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలు, 1998కి ముందు పెండింగ్‌లో ఉన్న 3500 ఉద్యోగాలను ఒకే దఫా ఇప్పిస్తామని తెలిపారు. కార్మికుడి ఉద్యోగ విరమణ వయస్సును పెంచారని, మ్యాచింగ్ గ్రాంటును రూ.20లక్షలకు పెంచారని, విధి నిర్వహణలో కార్మికుడు సాధారణ మరణం చెందితే రూ. 1.5 లక్షలు ఇచ్చేవారని, దాన్ని రూ.15 లక్షలకు పెంచారని, సింగరేణి క్వార్టర్లలో ఉచిత విద్యుత్, కార్మికుడి తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, సింగరేణి కార్మికులకు డబుల్‌బెడ్ రూం క్వార్టర్లు, అంబేద్కర్ జయంతికి వేతనంతో కూడిన సెలవుదినం, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్‌లకు ఆప్షనల్ హాలిడే, అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన కార్మికుడికి బేసిక్ ప్రొటెక్షన్, ఐఐటీ, ఐఐఎం లో చదివే కార్మికుల పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్, సకల జనుల సమ్మె వేతనం చెల్లింపు, తెలంగాణ ఇంక్రిమెంట్ ఇలా చెప్పుకుంటూ పోతే సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టారని తెలిపారు. కోయగూడెం ఓసీ 3, సత్తుపల్లి ఓసీ 3, కేకే 6, శ్రావణపెల్లి ఓసీ వేలం వేయకుండా సీఎం కేసీఆర్ అడ్డుకున్నారని, మళ్లీ ఎన్నికల అనంతరం వేలం కొనసాగించే ప్రమాదం ఉందన్నారు. బీఆర్ఎస్ గెలిస్తేనే బొగ్గు గనుల వేలం ఆపడం సాధ్యమని తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య, నాయకులు సమ్మిరెడ్డి, గౌరీపతిశర్మ, కొచ్చర్ల రవి, సాంబయ్య, రాంచందర్, దేవరకొండ మధు, మల్లారెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, జగత్‌రావు, రవి, లక్కాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

- అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్న సీఎం ప్రసంగం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల గుణగణాలను విడమరిచి చెప్పిన కేసీఆర్
- దివాకర్‌రావు గెలుపు నల్లేరు మీద నడకే

మంచిర్యాల టౌన్, నవంబర్ 25 : ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 24న మంచిర్యాలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ రెట్టింపు అయ్యింది. భారీగా తరలివచ్చిన జనాలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగం అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది. అందరికీ అర్థమయ్యే రీతిలో ఆయన మాట్లాడిన తీరు సభికులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది. మరోవైపు కాంగ్రెస్ గెలిస్తే ఏం జరుగుతుందో, మంచిర్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే ఏం జరుగుతుందో విడమరిచి చెప్పిన తీరుతో ప్రజలంతా ఒక్కసారిగా ఆలోచనలో పడ్డారు. మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి సౌమ్యుడు, మర్యాద తెలిసిన వ్యక్తి, ఆయన ఎప్పుడు తనను కలిసినా తన సొంత పనులు అడుగడు, ప్రజలకోసమే అడుగుతాడు, మంచి మనిషిని గెలిపించుకోండి, మీ పనులన్నీ వెంటనే చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడంతో పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు. ధరణి, రైతుబంధు, 24 గంటల కరెంటు కావాల్నా, వద్దా అని అడిగి సభకు వచ్చిన ప్రజలతోనే చెప్పించారు. కాంగ్రెస్ వాళ్లు వస్తే చీకట్లు కమ్ముకుంటాయని, రైతు బంధుకు రాంరాం పలుకుతారని, రైతుల భూములు పరుల చేతికి పోతాయని వివరించారు. ఇన్నాళ్లు పట్వార్లు, గిరిద్వార్లు ఎట్లా చేసేదో చెప్పారు. కాంగ్రెస్ వస్తే మళ్లా పట్వారీ వ్యవస్థ తీసుకువస్తానని అంటున్నారని, అపుడు రైతుబంధు రూ. 80 వేలు వస్తే సదరు పట్వారీ మరి నాకెంత అని రూ. 30 వేలు లాగుతాడని, ఇలాంటి వ్యవస్థ మనకు కావాలా అని ప్రశ్నించారు. 24 గంటల వద్దని, మూడు గంటల కరెంటే చాలని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, అలా అయితే మళ్లీ మునుపటి పరిస్థితులే ఉంటాయని, పొలాలు ఎండిపోతాయని వివరించారు. దీంతో రైతులు కేసీఆర్ మాట్లాడిన మాటలతో ఒక్కసారిగా ఆలోచనలో పడ్డారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే మనకు మేలు జరుగుతుందని రైతులను ఆలోచింపజేశారు., మంచిర్యాల, నస్పూరు పట్టణాల్లో మూడేళ్లుగా వరుసగా వర్షాకాలంలో ఇండ్లలోకి నీరు రావడంపై మాట్లాడిన కేసీఆర్ ఇక్కడి ప్రజలకు స్పష్టమైన హామీని ఇచ్చారు. గోదావరి నదికి కరకట్టలు నిర్మించి చుక్క నీరు కూడా ఇండ్లలోకి రాకుండా ఈ ఎండాకాలంలోనే చర్యలు తీసుకుంటానని చెప్పడంతో ఈ ప్రాంతం నుంచి వచ్చిన ప్రజలు చప్పట్లద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

### సింగరేణి కార్మికుల్లో నూతనోత్సాహం..

సింగరేణి గురించి మాట్లాడిన కేసీఆర్ కార్మికుల్లో సంతోషాన్ని నింపారు. 15 శాతం ఉన్న లాభాల వాటాను 32 శాతానికి పెం చానని, తద్వారా ప్రస్తుతం ఒక్కో కార్మికుడికి లక్షన్నర నుంచి ఆరు లక్షల దాకా వచ్చాయన్నారు. అసలు సింగరేణిని నిండా ముంచింది కాంగ్రెస్ నాయకులేనని, వందశాతం తెలంగాణకే చెందిన సింగరేణి సంస్థను కాంగ్రెస్ దద్దమ్మలు కేంద్రానికి తాకట్టు పెట్టారని ఎద్దేవా చేశారు. 1981 నుంచి వారసత్వ ఉద్యోగాలను 1998లో పొగొట్టారని, తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించామన్నారు. సింగరేణి కార్మికుల గురించి మాట్లాడుతున్నంత సేపు జై కేసీఆర్, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒకదశలో సింగరేణి కార్మికున్ని ఉద్దేశించి ఇక ఆపవయ్యా, నీ నాయకత్వం తగలెయ్యా, ముందు నేను చెప్పేది విను అంటూ సీఎం నవ్వులు పూయించారు. ఇక ఆసరా పెన్షన్లను రూ. రెండు వేల నుంచి దశలవారిగా ఐదువేలకు పెంచుతామని, దివ్యాంగులకు రూ. ఆరు వేలు ఇస్తామని, సౌభాగ్యలక్ష్మి పథకం కింద పేదింటి మహిళలకు రూ. మూడు వేలు, కేసీఆర్ బీమా కింద రూ.ఐదు లక్షలు, ఆరోగ్య రక్ష పథకం ద్వారా రూ. 15 లక్షల వరకు వైద్యఖర్చులు, సన్నబియ్యం పంపిణీ వంటివి చేస్తామని చెప్పి పేద, బడుగువర్గాలను ఆకట్టుకున్నారు. కాంగ్రెస్‌కి ఓటు వేస్తే మీ వాడలో ఉన్న మురికి కాలువలో వేసినట్టేనన్న కేసీఆర్ మంచిర్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావుకు ఓటేస్తే ఏం జరుగుతుందో వివరించి చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే వాడకో పత్తాలాట క్లబ్‌లు వెలుస్తాయని, ఇండ్లమ్మి పత్తాలాట ఆడాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచినా బీఆర్ఎస్‌లోనే చేరుతానని అంటున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటి ఝూటా మాటలు నమ్మవద్దని అన్నారు. కాంగ్రెస్ గెలుస్తుందని ప్రచారం చేసుకుంటున్నదని, వాళ్లకు అంత సీన్ లేదని అన్న మాటలకు సభికులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. దివాకర్‌రావు గురించి చెప్తూ ఇలాంటి మంచి వ్యక్తిని గెలిపించుకుంటే మీకు అంతా మంచే జరుగుతుందని, తప్పుదారి కాంగ్రెస్‌కు ఓటేయవద్దని కోరారు. హైదరాబాద్ నుంచి మొదటగా మంచిర్యాల సభలోనే పాల్గొన్న కేసీఆర్ సభకు హాజరైన జనాలను చూసి హుషారుగా కనిపించారు. తాను చెప్పాల్సిన మాటలన్నీ ప్రజలకు విడమరిచి చెప్పారు. జనం మాటల్లో ఇక దివాకర్‌రావు గెలుపును ఎవరూ ఆపలేరని మాట్లాడుకోవడం కన్పించింది. మళ్లీ దివాకర్‌రావే మన ఎమ్మెల్యే అంటూ మహిళలు, యువకులు మాట్లాడుకుంటూ ఇండ్లకు బయలుదేరారు.